# స్థాన మహిమ

**పారిస్‌కి నేను పదిహేను రోజుల ముందుగా వెళ్లాను మాధవీ మీనన్‌కన్న.**

అసలు మేమిద్దరం కలిసే వెళ్లాల్సింది. మా పరిశోధనా సంస్థ సమాచార విభాగంలోని ఉద్యోగుల్లో నాకూ, విద్యార్థుల్లో మాధవికీ ఫ్రెంచ్ ప్రభుత్వపు స్కాలర్‌షిప్ లభించింది. సమాచార సేకరణ, సమర్పణ, వినియోగ విధానాలను అధ్యయనం చెయ్యడానికి ఇచ్చిన అవకాశం ఇది. భారత, ఫ్రెంచ్ దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను పెంపొందించుకునే కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో అధ్యయన కార్యక్రమాలు కొనసాగించడానికి అక్కడి విద్యార్థులనూ, ఉద్యోగులనూ కొందరిని ఇక్కడికీ, ఇక్కడి విద్యార్థులనూ, ఉద్యోగులనూ కొందరిని అక్కడికీ ఆహ్వానిస్తాయి రెండు ప్రభుత్వాలూ.

నాకు వీసా, టికెట్టూ ముందుగా రావడంవల్ల నేను మాధవి కన్న ముందుగా పారిస్ చేరుకున్నాను. అసలే ఒక్కర్తెనీ బిక్కు బిక్కుమంటూ వెళ్లాను. దానికి తగినట్లు నన్ను కలుసుకుందుకు ఎయిర్ పోర్ట్‌కి రావలసిన వాళ్లు రాకపోయే సరికి నానా తంటాలూ పడి 'మెయ్‌జోన్ద్ లాండ్' అనే ఇండియన్ హాస్టల్‌కి చచ్చిచెడి చేరుకున్నాను. అక్కడ నుంచి మరునాడు బోర్డోకి ప్రయాణం. అదంతా వేరే కథ!

అసలు కథ మాధవితోనే మొదలైంది. అంతవరకూ బోర్డోలో నాతో కాస్త చనువుగా తిరుగుతున్న మా 'హాస్టల్ మేట్' మురళికి మాధవిని పరిచయం చెయ్యగానే అయస్కాంతంలా ఆ అమ్మాయికి అతుక్కుపోయాడు!

సహజమేలే అని నా మనసుకి సర్ది చెప్పుకున్నాను. వయస్సులో తల్లీ కొడుకుల కున్నంత వ్యత్యాసం ఉంది నాకూ మురళికీ మధ్య. వాళ్లిద్దరూ ఈడూజోడుగా ఉన్నారు మరి! జోడు కుదరడం సహజమే. అంత మాత్రాన నన్ను దూరం చేసుకోనక్కర్లేదు కదా. నేనూ సరదాగానే ఉంటాను కదా కబుర్లు చెబుతూ.

నేను అక్కడికి వెళ్లిన మూడో రోజున హాస్టలు హాల్లో కొందరు విద్యార్థులూ మొదలైన వాళ్లతో - అందరూ విదేశీయులే- రకరకాల దేశాల వాళ్లు - వాళ్లతో మాట్లాడుతూంటే ఒక యువకుడు నా దగ్గరకు వచ్చి, 'క్షమించండి, మీరు తెలుగువారా?' అని అడిగాడు చిరునవ్వుతో.

'అవును, మీరూనా?' అన్నాను చిరునవ్వుతో.

'అబ్బ! ఎంత సంతోషంగా ఉందండీ! ప్రాణం లేచొచ్చింది తెలుగు మాట వినగానే. మీ కట్టూ బొట్టూ చూడగానే కచ్చితంగా తెలుగు వారే అయివుంటారని అనిపించేసిందండీ!' అన్నాడు సంబరంగా.

అతను ఆ క్రితం రోజునే వచ్చాడుట ఇండియా నుంచి. అసలు విజయనగరంట. చిత్రకళలో ప్రత్యేక శిక్షణ పొందడానికి వచ్చాడుట. అతనూ ఆరు నెలల పాటు ఉండాలిట. కాలం ఇక్కడ ఎలాగడుస్తుందా అని బెంగ పట్టుకుందిట వచ్చినప్పటి నుంచీ. తల్లిదండ్రుల్ని వదిలి అంతదూరం రావడం అదే మొదలుట.

అప్పటినుంచీ, తీరిక దొరికినప్పుడల్లా నాతో కలిసి తిరిగేవాడు - భోజనానికి వెళ్లేటప్పుడూ, సూపర్ బజారుకి వెళ్లేటప్పుడూ నాకూ అతని తోడు దొరికింది.

మా కుటుంబం గురించి వివరాలు అడుగుతూ తమ కుటుంబం గురించి విశేషాలు నాకు చెబుతూ ఉండేవాడు.

మురళికి ఒక అన్నయ్యా, ఇద్దరు చెల్లెళ్లూ ఉన్నారు. వాళ్ల నాన్నగారు కూడా చిత్రకారుడే . పైడి రాజు గారి శిష్యుడుట. తనకు పైడి రాజుగారూ, తన తండ్రీ కూడా గురువులుట. తండ్రి చాలా ప్రతిభావంతుడైనా పరిస్థితులు అనుకూలించక పైకి రాలేక పోయాడుట. రావలసినంత కీర్తి రాలేదు. ఆ ఊళ్లోనే స్కూల్లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసి ఈ మధ్యనే రిటైరయారు. మురళీ వాళ్లన్నయ్య బి.ఎ.బి.ఎడ్. చేశాక, తండ్రి ఉద్యోగం చేసిన స్కూల్లోనే తెలుగు - లెక్కలు టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో మురళి కొక్కడికే చిత్రకళ బాగా అబ్బింది. చిత్రకళలో డిగ్రీ ఉంది. మామూలు చదువు ఇంటర్ వరకూ - అని చెప్పాడు. అన్నగారికి పెళ్లయింది. ఏడాది కొడుకు. పెద్ద చెల్లెలికి ఆరు నెల్ల క్రితమే పెళ్లయింది. అత్తవారి ఊరు విశాఖపట్నం. తరచు వచ్చి వెళ్లడానికీ, చెల్లెల్ని చూసి రావడానికీ వీలవుతుందని సంతోషంగా చెప్పాడు. రెండో చెల్లెలు టెన్త్ చదువుతోందిట. ముగ్గులు బ్రహ్మాండంగా వేస్తుందిట. చక్కని చుక్కలా ఉంటుంది. ఆ అమ్మాయిని మోడల్‌గా చేసి చిన్నప్పుడు ఎన్నో చిత్రాలు వేశాడు. 'ఇప్పుడు వేస్తే బావుండదు కదండీ' అన్నాడు! వాళ్లమ్మగారంటే మురళికి చెప్పలేనంత గౌరవం. ప్రేమ. తనంటే తల్లి దండ్రులిద్దరికీ ఎంతో ఆపేక్షట. తను ఏదడిగినా

కాదనరుట. అది తన అదృష్టం అన్నాడు. ఎప్పుడూ వాళ్ల విజయనగరం కబుర్లు చెబుతూండేవాడు. విజయనగరం వంటి చారిత్రక నగరంలో - సాహిత్యానికీ, లలిత కళలకూ పుట్టినిల్లనదగిన విజయనగరంలో పుట్టడం తన పూర్వ జన్మ సుకృతం అనేవాడు సగర్వంగా.

మాధవీ మీనన్ వచ్చాక మురళికి తెలుగు మీద మోజు పోయినట్టుంది! యుక్త వయస్సులో అందం ఇట్టే ఆకర్షిస్తుంది (ఒక్కొక్కప్పుడు అందం లేక పోయినా ఉన్నట్లే అనిపిస్తుంది!) ఇక తక్కిన వాటి మీద వేటి మీదా మోజుండదు. నేనూ ఒకప్పుడు ఆ మార్గంలో పయనించిన దాన్నే కాబట్టి వాళ్ల వర్తమాన మానసిక పరిస్థితిని అర్థం చేసుకోగలిగాను.

మూణ్ణెల్ల తరవాత మా బస మళ్లీ పారిస్‌కి మారింది. భోజనానికి వెళ్లేటప్పుడు మొదట్లో నన్ను కూడా రమ్మని పిలుచుకు వెళ్లినా, సూపర్ బజార్లకీ, మ్యూజియమ్స్ మొదలైన వాటికీ వాళ్లిద్దరే కలిసి వెళ్లడం మొదలు పెట్టారు. అందరం కలిసి వెళ్లి, 'మ్యూజేదులూవ్ర్' చూడాలని ఎంతో తహతహలాడాను. ఓ రోజున నాతో చెప్పకుండా వాళ్లిద్దరూ వెళ్లి చూసొచ్చారు. నాకు నిజంగా ఏడుపొచ్చింది.

ఎక్కడికైనా వెళ్లాలంటే తోడు రమ్మంటే రావడానికి బోలెడంత మంది విదేశీ మిత్రులు దొరుకుతారు. కాని ఎందుకో నాకు ఇంక ఎవరినీ తోడు రమ్మనడానికి మనస్కరించేది కాదు.

కొన్నాళ్ల పాటు ఖాళీ సమయాల్లో ఎవరితోనూ కలవకుండా ఒక్కర్తెనీ తిరిగేదాన్ని పట్టుదలగా. తిరిగే ఓపిక లేకపోతే గదిలో కూర్చుని పుస్తకాలు చదువుకునేదాన్ని. లేకపోతే, ఇంటికి పెద్దపెద్ద ఉత్తరాలు రాస్తూ కూర్చునే దాన్ని.

మాధవి మాత్రం పగటి పూట వర్కింగ్ డేస్‌లో నాతో కలిసి వివిధ విద్యా సంస్థలనూ, పరిశోధనా సంస్థలనూ, సమాచార కేంద్రాలనూ సందర్శించడానికి రావలసివచ్చేది. మేమిద్దరం ఒకే సంస్థ నుంచి ఒకే విషయం మీద వేరు వేరు స్థాయిల్లో అధ్యయనం చెయ్యడానికి వచ్చాం కనుక నాతో కలిసి వెళ్లడం తప్పేది కాదు మాధవికి. కానీ, నాతో ఉన్నప్పుడు ముభావంగా ఉండి ముక్తసరిగా మాట్లాడేది. నేనే ఎప్పుడూ ఏదో వాగుతూ ఆ అమ్మాయిని మాటల్లోకి లాగడానికి ప్రయత్నించేదాన్ని.

మా కుటుంబం గురించి ఈ కబురూ ఆ కబురూ చెబుతూ, మాధవి కుటుంబం గురించి అడిగి కొన్ని వివరాలు తెలుసుకున్నాను. ఓ పట్టాన సులభంగా చెప్పేది కాదు. అవన్నీ రహస్యాలయినట్టూ, వాటిని కాపాడుకోవాలన్నట్టూ ప్రవర్తించేది. ఎలాగో ఒడుపుగా కొన్ని ముఖ్య వివరాలను మాత్రం రాబట్టగలిగాను. మాధవి తండ్రి మీనన్ ఢిల్లీలో పూసా

ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ సైంటిస్టు. తల్లి ఉద్యోగం చెయ్యదుగాని, సోషల్ వర్క్ చేస్తూ ఉంటుంది. ఒక చెల్లెలూ, తమ్ముడూ ఉన్నారు మాధవికి. ఇద్దరూ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేస్తున్నారు. వాళ్లిద్దరూ కవలపిల్లలుట. వాళ్లిద్దరూ అంటే తల్లిదండ్రులకి ప్రాణం. వాళ్లంటే కించిత్తు అసూయ ఉన్నట్లు మాధవి ఆ మాటలన్న తీరుబట్టి, తరవాత చెప్పిన చిన్నచిన్న విషయాల బట్టి గ్రహించాను. ఇవన్నీ ఒక్కసారిగా చెప్పిన విశేషాలు కాదు. అప్పుడూ అప్పుడూ చెప్పీ చెప్పనట్లు చెప్పిన సంగతులు. మాధవి నా గురించి కుతూహలంగా ఏమీ ప్రశ్నించేది కాదు. నేనే నోరు మూసుక్కూర్చోలేక, అవకాశం వచ్చినప్పుడల్లా చెబుతూండేదాన్ని. నేను చెప్పేవి వింటూ అప్పుడప్పుడు నవ్వేది. నవ్వితే మాధవి అందంగా కనిపిస్తుంది. కానీ ఓ పట్టాన నవ్వేది కాదు నా ముందు. అలాగని ముభావంగా ఉండే స్వభావం కాదు మాధవిది. తన **తోటి** వయస్సు వాళ్లతో సరదాగా నవ్వుతూ తుళ్లుతూ మాట్లాడేది. మురళితో సరేసరి. ఇద్దరూ భుజాలు భుజాలు రాసుకుని తిరుగుతూండేవారు తీరిక చిక్కినప్పుడల్లా.

ఎంత సమాధాన పరచుకున్నా, నా ఒంటరితనం నన్ను వెక్కిరించినట్లనిపించేది. హఠాత్తుగా వృద్ధాప్యం వచ్చి మీద పడినట్లనిపించేది. కొత్తగా వచ్చిన కోడలికి కొడుకు దగ్గరవుతూంటే అత్తగారికి అసూయ కలిగినట్లు మాధవి ప్రవర్తన నా మనసులో ముల్లులా గుచ్చుకుని బాధ పెట్టేది.

ఒకసారి "మాల్ మెయిజో(" అనే భవనానికి వెళ్లాలనుకున్నాను. అక్కడ మా అన్నయ్య స్నేహితుడొకతను పనిచేస్తున్నాడు. అతన్ని చూసి రమ్మని మా అన్నయ్య చెప్పాడు. అతన్ని కలుసుకోవాలి. కానీ చాలా దూరం వెళ్లాలి. ఒక్కర్తినీ ఎలా వెళ్లడం అనుకుని మాధవిని తోడురమ్మన్నాను. నేను రాలేనని నిర్మొహమాటంగా చెప్పి, హాస్టల్లో మురళి గదివైపు వెళ్ళిపోయింది.

వాళ్లిద్దరి మధ్యా చనువు బాగా పెరిగింది. ఇద్దరూ ఒకే మంచం మీద గోడకి జార్లబడి దగ్గరగా కూచుని ఒకే పత్రిక పట్టుకుని ఏదో చదువుతూ నవ్వుకోవడం చూశాను ఒకటి రెండుసార్లు.

ఒకసారి అక్కడ హాస్టల్లోని విదేశీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అందులో అన్ని దేశాల వాళ్లూ ఏదో ఒక అంశాన్ని - సంగీతాన్ని గాని, నృత్యాన్ని గాని, మరేదైనా గాని ప్రదర్శించాలి. భారతదేశం నుంచి మేం ముగ్గురం కాక, బంగ్లాదేశ్ నుంచి ఒక కుర్ర వాడూ, నేపాల్ నుంచి ఒకాయన ఉన్నారు మా జట్టులో. మేము కూడా ఏదైనా ప్రదర్శించాలని అన్నారు తక్కిన విద్యార్థులు.

నేపాలీ అతను ఫ్లూట్ వాయిస్తాడు. నాకో ఆలోచన వచ్చింది. మాధవి చేత గొల్లభామ

వేషం వేయించి, నేపథ్యంలో ఫ్లూట్ వాయిస్తూంటే, మాధవి చేత స్టేజిమీద రాధలా అభినయం చేయిస్తే బావుంటుందని తోచింది. మాధవిని బతిమాలి చచ్చి చెడి ఒప్పించాను. 'మధురా నగరిలో...' అనే పాటకి తగినట్లు అభినయం ఎలా చెయ్యాలో నేను చెబుతానన్నాను. చిన్నప్పటి నుంచీ ఎన్నో సార్లు విన్నదీ కన్నదీ బాగా గుర్తుండటం వల్ల.

స్టేజి మీద వెనక గోడకి పెద్ద బ్లాక్ బోర్డ్ ఉంది. దాని పైన మురళి ఒక ప్రకృతి దృశ్యాన్ని రంగుల చాకోపీసెస్‌తో చిత్రించాడు. నేనూ బంగ్లాదేశ్ కుర్రవాడూ ఒక పట్టుచీరని రెండు మడతలు వేసి ఇటొకరూ అటొకరం పట్టుకుని రాధ వేషం వేసిన మాధవికి అడ్డుగా పెట్టి, రాధ స్టేజి మధ్య కొచ్చాక చీర అడ్డు తొలగించి మేము తప్పుకున్నాం. ఫ్లూట్ వాయించడం ప్రారంభమయింది. రాధ కనిపించగానే ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేశారు.

-మాధవి పెద్ద పెద్ద కళ్లను ఇటూ అటూ తిప్పుతూ కాళ్లూ చేతులూ వొయ్యారంగా ఆడిస్తూ మధ్య మధ్య మురళి ఊదుతున్నట్లు అభినయించే సరికి అర్థంకాకపోయినా అందరూ ముగ్ధులయిపోయారు. ఒకటే చప్పట్లు! ఎప్పుడూ పోనీ టెయిల్ వేసుకుని, పంజాబీ డ్రెస్‌లోనూ, జీన్స్‌లోనూ తిరిగే ఆ అమ్మాయి అలా చక్కగా చీర (నా చీరే) కట్టుకుని, జడ వేసుకుని, బొట్టు పెట్టుకుని, గాజులూ, గొలుసూ (నావే) వేసుకుంటే ఎంతో చూడముచ్చట గొలిపింది. నాకు చాలా ఆనందం కలిగింది. అంత అందమైన అమ్మాయిని నేనే సృష్టించినట్లు! కార్యక్రమం తరవాత మాధవిని అందరూ ఒకటే అభినందించడం!

ఆ ఉత్సాహంలో, తరవాత అందరం కలిసి భోంచేస్తున్నప్పుడు నేను మాధవిని పొగుడుతూ, "సత్యజిత్‌రాయ్‌లాంటి వాళ్ల సినిమాల్లో హీరోయిన్‌గా వేస్తే బాగా నప్పుతావ్" అన్నాను. "ఓ, నో!" అంది మాధవి సిగ్గుపడుతూ. అంతలోనే మురళి "నో, మేడమ్, అలాంటి మాట ఎప్పుడూ అనకండి!" అన్నాడు గంభీరంగా మొహం పెట్టి. నేను తెల్లబోయినట్లు చూశాను ఏమనాలో తెలియక. మురళి తన పక్క కుర్చీలో కూర్చున్న మాధవి భుజాల చుట్టూ పొదువుకున్నట్లు చెయ్యి వేసి, "మాధవి అటువంటి రంగంలో ప్రవేశించడం అనే ఊహ కూడా నేను భరించలేను" అన్నాడు. మాధవి ఏమీ మాట్లాడకుండా గువ్వపిట్టలా అతని చేతిలో వొదిగిపోయింది.

అబ్బో, వ్యవహారం చాలా దూరం వెళ్లిందే అనుకున్నాను. ఇప్పటి నుంచీ అతను ఆ అమ్మాయి మీద అంత పెత్తనం చెలాయిస్తుంటే నాకు ఒళ్లు మండి వాదనలోకి దిగాను. "తప్పేముంది! సత్యజిత్‌రాయ్ లాంటి వాళ్ల సినిమాలను చూసి ఆనందిస్తాం, ఓహో అని నటీనటులను మెచ్చుకుంటాం. అందులో హీరోయిన్‌గా వేస్తే తప్పేముంది? ఆ స్త్రీని చిన్న చూపు చూడటం ఏం న్యాయం" అన్నాను.

నిశ్శబ్దంగా తినడం పూర్తిచేసి, "సారీ, మేడమ్, ఇంక ఆ విషయమై నేను చర్చించదలుచుకోలేదు" అంటూ కుర్చీలోంచి లేచి, "కమాన్, మాధవీ" అన్నాడు. మాధవి వెంటనే లేచి, "బై" అంటూ నాకేసి ఒక చూపు విసిరేసి అతన్ని అనుసరించింది.

అప్పటినుంచీ మాధవి మానసికంగా నాకు ఎంత దూరమైందో అతనికి అంత దగ్గరయిందనిపించింది.

ఆరు నెల్ల సహవాసం. ఆఖరి రోజుల్లో వాళ్లు చిలకా గోరింకల్లా తిరిగారు. నేను ఉద్యోగ ధర్మంగా వచ్చాను కాబట్టి నా అధ్యయనం గురించి వివరంగా రిపోర్ట్ రాసి మా సంస్థ అధికారులకు సమర్పించాలి. మాధవికా బాధ లేదు. విద్యార్థిని కాబట్టి అటువంటి బాధ్యత లేదు. దీనికి పరీక్షలు కూడా ఉండవు!

నా రిపోర్ట్ తయారు చేసుకోవడంలో నన్ను ఒంటరితనం బాధించలేదు. వాళ్ల గురించి పట్టించుకునే ఆసక్తి లేదు, తీరికా లేదు. రోజులు ఇట్టే గడిచిపోయాయి అనిపించింది వాళ్లకీ నాకూ కూడా - కారణాలు వేరైనా.

ఇండియాకి తిరిగి వచ్చాక ఇంటిపనులలోనూ, ఉద్యోగ బాధ్యతలలోనూ మునిగిపోయాను. అయినా, ఒకసారి మా ఇంట్లో ఇచ్చిన పార్టీకి మాధవిని కూడా పిలవాలనుకున్నాను. కానీ ఆ సమయానికి తను ఊళ్లో లేదని తెలిసింది. తరవాత నాకు తీరిక చిక్కలేదు. మాధవి నాకు అరుదుగా కనిపించేది - అది కూడా దూరం నుంచి "హాయ్" అంటూ.

చాలా రోజులకి మురళి "నూతన సంవత్సర శుభాకాంక్షలు" పంపాడు విజయనగరం నుంచి. గ్రీటింగ్ కార్డ్ మీద మంచి బొమ్మ వేశాడు. వెంటనే నేను ఉత్తరం రాశాను ఆప్యాయంగా - నన్ను తలచుకున్నందుకు ('చిత్ర పూర్వకంగా') సంతోషం తెలుపుతూ, మాధవితో పెళ్లెప్పుడు అని అడుగుతూ, శుభలేఖ కోసం ఎదురుచూస్తున్నానని రాశాను. అతని జవాబు నన్ను ఆశ్చర్యంలో ముంచింది. ఇండియాకి తిరిగి వచ్చినప్పటి నుంచీ మాధవి మారిపోయిందనీ, ముఖ్యంగా విజయనగరం వచ్చి తమ ఇంట్లో రెండు రోజులుండి వెళ్లినప్పటి నుంచీ ఉత్తరాలు రాయడం మానేసిందనీ, మాధవిని కలుసుకుని ఆమె మనస్సులో ఏముందో కనుక్కుని తనకు తెలియజేయవలసిందనీ ప్రాధేయపడుతూ రాశాడు.

ఇటువంటి రాయబారం చాలా సున్నితమైనదని తెలిసినా, కొంత మురళి మీద జాలితోనూ, కొంత నా కుతూహలం కొద్దీనూ ఎలాగో మాధవిని పట్టుకుని కేంటీనుకి తీసుకెళ్లాను. మెల్లగా విషయం కదిపాను - వాళ్ల పెళ్లి విషయం.

"నేనెప్పుడూ అతనితో నా పెళ్లి గురించి ప్రస్తావించలేదు" అంది నిర్లక్ష్యంగా ఎటో చూస్తూ.

"నిజమా? మరి అతను అటువంటి ఆశ పెట్టుకున్నాడే!" అన్నాను ఆశ్చర్యంగా.

వెంటనే మాధవి చిరాగ్గా మొహం పెట్టి, "అతనితో నాకు పెళ్లెలా కుదురుతుంది? ఆ కుటుంబంలో వాళ్లూ, వాళ్ల అలవాట్లూ! అక్కడ నేను ఉండగలగడం అసాధ్యం... అయినా, నేనిప్పుడప్పుడే పెళ్లి చేసుకోదలచుకోలేదు. నేను రీసెర్చి చెయ్యాలి"అంది.

"మరి అక్కడుండగా అంత క్లోజ్‌గా తిరిగారు కదా!" అన్నాను ఊరు కోకుండా.

"అక్కడ వేరు పారిస్‌లో కాబట్టి, ఒంటరిగా ఉన్నాం కనక కలిసి స్నేహంగా తిరిగాం. అంతే!" అంది మాధవి నిర్మొహమాటంగా.

ఆ అమ్మాయి మాటలకి మొదట నిర్ఘాంతపోయాను. కాని తరవాత ఆలోచిస్తే, ఆడపిల్ల మంచైనా చెడైనా తన ప్రవర్తనకి తను బాధ్యత వహించడం, తన జీవన మార్గం గురించి స్వయంగా ఆలోచించి, నిర్ణయం తీసుకోవడం మంచిదే కదా అనిపించింది. పరిచయమైన ఓ యువకుణ్ణి 'ప్రేమిం'చేసి ఆ తరవాత చింతించే కన్నా, ఏ కారణం వల్లనైనా నచ్చకపోతే, మరోసారి ఆలోచించుకుని, వేసిన అడుగు వెనక్కి తీసుకుంటే తప్పేముంది అనుకున్నాను.

జీవితంలో ఇటువంటి అనుభవాలు మన మంచికే అనుకోవాలనీ, మనసుకి పట్టించుకుని బాధపడుతూ జీవితాన్ని పాడు చేసుకోకూడదనీ స్నేహపూర్వకంగా రాశాను మురళికి.

**వనిత, దీపావళి విశేష సంచిక, నవంబర్ '94**